క్లుప్తంగా

వ్యక్తికి గాయాలు

పార్వతీపురం టౌన్: చలి మంటలో పడి వ్యక్తికి గాయాలైన ఘటన కొమరాడ మండలంలో చోటు చేసుకుంది. జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.. కొమరాడ మండలం తీలేసు గ్రామానికి చెందిన కంద్రక సారితకు ఫిట్స్ ఉంది. గురువారం ఉదయం చలి మంట వేసుకొని కాస్తుండగా పొరపాటున ఆ మంటలో పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వాలీబాల్ పోటీలు

సాలూరు రూరల్: మండలంలోని నేరెళ్లవలస గ్రామంలో వాలీబాల్ సెమీఫైనల్, ఫైనల్ పోటీలు శుక్రవారం నిర్వహించనున్నట్టు రూరల్ సీఐ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం ఎస్పీ ఆదేశాలతో జిల్లాలో రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గెలిచిన జట్లకు నేరెళ్లవలసలో శుక్రవారం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొన్న గిరిజన యువకులకు వాలీబాల్ కిట్లు అందజేయనున్నట్టు తెలిపారు.

గోశాలల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: గ్రామాల్లో నిర్మితమవుతున్న గోశాలలు, వసతిగృహాల ప్రహరీల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. నిర్దేశించిన గడువులోగా నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపునకు తగు చర్యలు చేపడతామన్నారు. బూర్జ వసతిగృహం ప్రహరీ, పెదంకలాంలో గోశాల నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులున్న రైతులకు మంజూరు చేసిన గోశాలల నిర్మాణాలు నిర్దేశించిన గడువులోగా, నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల సర్పంచ్‌లు, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

సారా ప్యాకెట్ల పట్టివేత



పట్టుకున్న సారా ప్యాకెట్లను చూపిస్తున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద ఇద్దరు మహిళల నుంచి 1500 సారా ప్యాకెట్లను పట్టుకున్నట్టు సీఐ అప్పలనాయుడు గురువారం తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ మహిళ, పట్టణంలోని ఎరుకుల వీధికి చెందిన మరో మహిళ నుంచి ఈ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఇద్దరి మహిళలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ఎల్ఐసీ క్లాస్ 3, 4 ఉద్యోగుల నియామకం చేపట్టాలి



ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పార్వతీపురం టౌన్: ఎల్ఐసీ క్లాస్ 3, 4 ఉద్యోగుల నియామకం చేపట్టాలని ఎల్ఐసీ బీస్ యూనిట్ ప్రెసిడెంట్ టి.ధర్మారావు డిమాండ్ చేశారు. పార్వతీపురం ఎల్ఐసీ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ఏఐఐఏ గుర్తింపునివ్వాలన్నారు. మేనేజ్‌మెంట్ తక్షణమే ఉద్యోగుల రిక్రూట్‌మెంట్ చేపట్టాలని, లేకుంటే విశాఖ డివిజన్ ఐసీఈయూ ఇచ్చిన పిలుపు మేరకు మరిన్ని పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. నిరసనలో సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల జీవితాల్లో.. జ్ఞానజ్యోతి వెలుగులు



అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న డీఆర్పీ రమేష్‌బాబు

- అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ
- మూడు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తరగతులు

బలిజిపేట: చిన్నారుల జీవితాల్లో జ్ఞాన జ్యోతి వెలుగులు నింపేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలను కార్యోన్ముఖులుగా తయారు చేసేందుకు జ్ఞానజ్యోతి ఎఫ్ఎల్ఎన్ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతుల్లో బోధనాంశాలే భావి తరాల ఉన్నతికి పునాది కానున్నాయి.

ఏమిటీ శిక్షణ

మాతా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, సర్వశిక్ష అభియాన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ చొరవతో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(సాల్ట్) ప్రోగ్రాం పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తల కోసం నిర్దేశించిన ఈ శిక్షణ పేరు జ్ఞానజ్యోతి ఎఫ్ఎల్ఎన్ శిక్షణ. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో మొదటి విడతలో 89 మంది కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారు. వీరు సేవలందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న 3–6ఏళ్ల చిన్నారులకు ఈ శిక్షణ ద్వారా లబ్ధి చేకూరనుంది. తాజా గణాంకాల ప్రకారం బలిజిపేట మండలంలో 6 నెలల నుంచి 3సంవత్సరాలలోపు వారు 1130మంది, 3సంవత్సరాల నుంచి 6సంవత్సరాల వరకు 785మంది చిన్నారులు ఈ ప్రయోజనాలను పొందనున్నారు.

శిక్షణ ఎంతో మేలు



నూతన విధానంలో ఏ విధంగా బోధించాలనేది ఈ శిక్షణ ద్వారా తెలియజేస్తున్నారు. దీని వలన కేంద్రాలలో బోధించే విధానంలో మార్పులు తప్పకుండా వస్తాయి. ఆటపాటలతో బోధించే విధానం బాగా ఉంది. దానిపై అవగాహన కల్పించడం ఎంతో అవసరం.

– సులేఖ, సీడీపీఓ, బలిజిపేట ప్రాజెక్టు.

మూడేళ్ల సర్టిఫికెట్ కోర్సు

ఈ శిక్షణ అంగన్‌వాడీలకు మూడేళ్ల సర్టిఫికెట్ కోర్సు. మూడేళ్ల వ్యవధిలో ఏడాదికి 40రోజుల చొప్పున మొత్తం 120 రోజులు శిక్షణ ఇస్తారు. తొలి దశలో 20 రోజులు, మలి దశలో 20రోజుల చొప్పున కొనసాగనున్న ఈ శిక్షణ 20రోజుల వ్యవధిలో హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తారు. అంటే 6 రోజుల పాటు ఆఫ్‌లైన్ విధానంలో మిగిలిన 14రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు కొనసాగుతాయి. విద్యా శాఖ, సర్వశిక్ష అభియాన్, మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన ఆరుగురు డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్(డీఆర్‌పీ)లు శిక్షకులుగా కీ రిసోర్స్‌పర్సన్ పర్యవేక్షణలో బోధనా తరగతులు నిర్వహిస్తున్నారు.

ఇదీ లక్ష్యం

పిల్లల బాల్యారంభ సంరక్షణ, అభివృద్ధే ఈ కార్యక్రమం లక్ష్యం. శారీరక అభివృద్ధి, సామాజిక భావోద్వేగ, నైతిక అభివృద్ధి, మేథాభివృద్ధి, భాష–అక్షరాస్యత అభివృద్ధి, సౌందర్య–సాంస్కృతిక అభివృద్ధి అనే ఐదు అంశాల ప్రామాణికంగా పసి భవితకు భరోసా ఇవ్వడమే లక్ష్యంగా శిక్షణ కొనసాగుతోంది.

ఈ అంశాలపై శిక్షణ

ఆటల ద్వారా అభ్యాసం ఈ శిక్షణ లక్ష్యాల్లో ఒకటి. ఐదు అభివృద్ధి అంశాలను ఆటల ఆధారితంగా బోధించడంపై శిక్షణ ఇస్తారు. పిల్లల్లో శ్రద్ధను పెంపొందించేందుకు విభిన్న సామగ్రితో పాటు పాఠ్య పుస్తకాల ఆధారిత బోధన. పిల్లల తల్లిదండ్రులు, సంరక్షకులను నేర్పించడం, సంరక్షించడంలో భాగస్వామ్యం. తల్లిదండ్రులను నిమగ్నం చేయడానికి అనుసరించాల్సిన వివిధ మార్గాలు. రోజువారీ తరగతుల నిర్వహణలో పరిశీలనపై ఆధారపడిన అంచనా(అసెస్మెంట్) ద్వారా పిల్లల అభివృద్ధిపై అంచనా ప్రక్రియ. సమ్మిళిత విద్యా విధానాలను అవలోకనం చేసుకోవడం, మందిలో విద్యాబోధనను సరళీకృతం చేసే విధానాలు. పిల్ల ఆరోగ్యం, సంరక్షణ ప్రాధాన్యాలపై శిక్షణ.

లక్ష్మీనృసింహస్వామికి ముడుపుల పూజలు



మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీ ఒడ్డున వెలసిన లక్ష్మీనృసింహస్వామికి అర్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో గురువారం ముడుపుల పూజలు ఘనంగా నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మొక్కులు చెల్లించుకున్నారు.

– సీతానగరం

పోస్టల్ జీడీఎస్‌ల నిరసన



పోస్టల్ జీడీఎస్‌లకు ఎనిమిదో కమిషన్ అమలు చేయాలని పోస్టల్ పీజేసీఏ యూనియన్ నాయకుడు జె.రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. పార్వతీపురం హెడ్ పోస్టాఫీస్ వద్ద ఉద్యోగులతో కలిసి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు అనుకూలమైన కమలేష్ చంద్ర కమిటీలోని సానుకూల అంశాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పోస్టల్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఐసీడీ, సీడీసీ ప్రపోజల్స్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. తాడ్డి వేణుగోపాలరావు, బి.ఉమాశంకర్, ఎం.అప్పారావు, గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

– పార్వతీపురం టౌన్

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో సామాజిక సేవాభావం



విద్యార్థులతో ఎంఈఓ-1 సామల

బలిజిపేట: స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థుల్లో సామాజిక సేవాభావం, నాయకత్వ లక్షణాలు అలవడి వారి భవిష్యత్‌కు మంచి మార్గం ఏర్పడుతుందని ఎంఈఓ-1సామల సింహాచలం అన్నారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌గా ఎంపిక చేసిన 32మందికి ప్రత్యేక దుస్తులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక సేవాభావం, జాతీయ సమగ్రత, క్రమశిక్షణతో పాటు జీవిత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహదపడుతుందన్నారు. అన్ని పాఠశాలల్లో స్కౌట్ అండ్ గైడ్స్ ఏర్పాటుకు ప్రధానోపాధ్యాయులు చర్యలు చేపడితే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 కె.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, స్కౌట్ మాస్టర్ టి.పరుశురాం, గైడ్స్ టీచర్ పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

చెరువు గట్లపై సాగు మేలు

మక్కువ:

మండలంలోని పలు గ్రామాల సమీపంలో చెరువుల గట్లపై రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నారు. పంట పొలాల్లో కంటే, చెరువు గట్లపై రైతులు సాగు చేస్తున్న పంటలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. మండలంలో ఎస్.పెద్దవలస గ్రామం సమీపంలోని చెరువు గట్టుపై కొమ్ముశనగ పంటను రైతులు సాగు చేస్తున్నారు. మక్కువ సమీపంలో చెరువు గట్టుపై అరటి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా వేతనదారులు చెరువులో మట్టిని తీసి గట్టుపై వేయడంతో, సారవంతమైన మట్టి వలన పంటలు మంచి దిగుబడి అందిస్తున్నాయి. దీంతో రైతులు గ్రామాల సమీపంలోని చెరువు గట్లపై పలు రకాల పంటలను సాగు చేసి లాభాలు పొందుతున్నారు.



ఎస్.పెద్దవలస గ్రామ సమీపంలో చెరువుగట్టుపై శనగ పంట సాగు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సాలూరు: విద్యుత్ మెయింటినెన్స్ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ గోపాలరావునాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ శివాలయం ఫీడర్, 11 కేవీ పాలిటెక్నిక్ ఫీడర్, 11 కేవీ కొట్టక్కి ఫీడర్‌లు, 33కేవీ ఆటోనగర్ ఫీడర్‌ల పరిధిలో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఫీడర్‌ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈఓ సూరిదేముడు

సీతానగరం: జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా ప్రాజెక్టు అదనపు కోఆర్డినేటర్ తేజేశ్వరరావు, ఎంఈఓ జి.సూరిదేముడు అన్నారు. మండలంలోని జోగింపేట కేజీబీవీ విద్యాలయంలో ఈ నెల 18 నుంచి జరుగుతున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్లు వినియోగించుకోవాలన్నారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీఓ సులేఖ మాట్లాడుతూ బాల్య సంరక్షణ, విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు సూరిదేముడు, వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యు.పూర్ణిమ, కోర్సు డైరెక్టర్లు పి.కూర్మినాయుడు, సీహెచ్ గణపతి, రవికుమార్, కేజీబీవీ ప్రిన్సిపాల్ జె.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

వీరఘట్టం: మండల కేంద్రంలోని గణలక్ష్మీ సంతోషిమాత ఆలయ 15వ వార్షికోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎస్ శర్మయాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

సాలూరు:

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో సాలూరు అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం జాబితా విడుదల చేసింది. యూత్ వింగ్ అధ్యక్షుడిగా పొట్టంగి అచ్యుతరావు, మహిళా విభాగం బొడంకి పరిమల, రైతు విభాగం లచ్చిరెడ్డి అప్పలనాయుడు, బీసీ సెల్ సలాది అప్పలనాయుడు, ఎస్సీ సెల్ మజ్జి అప్పారావు, ఎస్టీ సెల్ నెమలిపిట్ట కళ్యాణ్, మైనార్టీ సెల్ మహమ్మద్ అబ్దుల్‌హుక్, క్రిస్టియన్ మైనారిటీ సెల్ గుడివాడ సూర్యనారాయణ, స్టూడెంట్ వింగ్ సంగిరెడ్డి అశోక్, పంచాయతీరాజ్ వింగ్ పాచిపెంట సూర్యనారాయణ, మున్సిపల్ వింగ్ కొల్లి వెంకటరమణ, ఆర్టీఐ వింగ్ పిరిడి రామకృష్ణ, వాలంటీర్స్ వింగ్ బూర పైడిరాజు, గ్రీవెన్స్‌సెల్ మేకల శంకరరావు, వాణిజ్య విభాగం కేతవరపు సత్యనారాయణ, వైఎస్సార్‌టీయూసీ వమ్మి నాగభూషణరావు, లీగల్ సెల్ బంకురు రామచంద్రరావు, కల్చరల్ వింగ్ కోట ఈశ్వరరావు, సోషల్ మీడియా వింగ్ మేటాక పైడపు నాయుడు, ఐటీ వింగ్ లింగాల శ్యామలరావు, దివ్యాంగుల విభాగం పొంద్రంకి అచ్చిబాబు, డాక్టర్స్ వింగ్ పతివాడ సత్యం, పబ్లిసిటీ వింగ్ కనిమెరక త్రినాధరావు, ఇంటిలెక్చువల్ ఫారమ్ అక్కేన సందీప్(హరి), బూత్ కమిటీల అధ్యక్షుడిగా మాదిరెడ్డి మధుసూదనరావులను నియమించారు. వీరంతా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు కృతజ్ఞతలు తెలిపారు.

జీడి మామిడికి రూ. 20వేలు మద్దతు ధర ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బుడితి అప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: జీడి మామిడి పంటకు క్వింటాకు రూ.20వేలు మద్దతు ధర ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో సాగవుతున్న జీడి మామిడి పంటకు గిట్టుబాటు ధర లేక దళారుల చేత దగా పడుతున్న గిరిజన రైతాంగాన్ని ఆదుకోవటానికి ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. తక్షణమే మద్దతు ధరను క్వింటాకు రూ. 20వేలు ప్రకటించి కొనుగోలు కేంద్రాల ద్వారా జీసీసీ ద్వారా సేకరించాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం పట్టణంలో జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్‌ను పెడతామని చెప్పడం సమంజసం కాదన్నారు. గిరిజనులు అత్యధికంగా సాగు చేస్తున్న ప్రాంతానికి అందుబాటులో ఉన్న కురుపాంలో ఈ యూనిట్‌ని పెట్టి గిరిజన రైతాంగానికి ఉపాధిని కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. కురుపాంలో మార్చి నెలలో భారీ సదస్సు నిర్వహించి కార్యాచరణ రూపొందించి గిరిజన రైతులు పండిస్తున్న పంటలకు ప్రభుత మద్దతు ధర కోసం దశలవారీ ఆందోళనకు కార్యక్రమం రూపొందించుకుంటామని తెలిపారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఈదిబిల్లి వెంకటనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కిమిడ రామమూర్తినాయుడు, పువ్వల ప్రసాద్, నీలమ్మ, ఆరిక నాగభూషణరావు, రమేష్ పాల్గొన్నారు.

బ్రిడ్జి మరమ్మతులకు గురవడంతో ఇబ్బందులు

మక్కువ: స్థానిక సువర్ణముఖి నది బ్రిడ్జి శ్లాబ్ మరమ్మతులకు గురవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం బ్రిడ్జి పైనుంచి మక్కువ మీదుగా దుగ్గేరు, శంబర, దబ్బగెడ్డ, తూరుమామిడి గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిడ్జి శ్లాబ్ గోతులమయమై, ఇనుప ఊచలు బయటకు కనిపించడంతో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే బ్రిడ్జి సమీపంలో ఉన్న రక్షిత మంచినీటి పథకం సంప్ నుంచి నీరు లీకై బ్రిడ్జిపై నుంచి తరుచూ ప్రవహిస్తుండటంతో, గోతులలో నీరు చేరి, గోతులు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి బ్రిడ్జి శ్లాబ్‌కు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



సువర్ణముఖి నది బ్రిడ్జి మరమ్మతులకు గురవడంతో చేరిన నీరు

విరగబూసిన మామిడి పూత

పార్వతీపురం రూరల్: ఈ ఏడాది మామిడి పూత ఆశాజనకంగా ఉంది. మండలంలోని వెంకంపేట, గంగాపురం, సంగంవలస, పెదబొండపల్లి, తాళ్లబురిడి, జముదాల, ములగ తదితర గ్రామాల్లో సుమారు 300 ఎకరాలకు పైబడి మామిడి తోటలు ఉన్నాయి. పూత ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆశలు పెంచుకుంటున్నారు. మరోవైపు పొగ మంచు తీవ్ర స్థాయిలో కురుస్తుండడంతో పూత రాలిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మామిడి పూత సస్యరక్షణలో భాగంగా రైతులు ఉద్యానవన శాఖాధికారుల సూచనల మేరకు క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తున్నారు. రెండేళ్ల నుంచి మామిడి పంట దిగుబడి లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాదైనా పంట కలిసి వస్తుందని రైతులు ఆశపడుతున్నారు.



తాళ్లబురిడి గ్రామ సమీపంలో విరగబూసిన మామిడి పూత

గిరిజనులకు మేలు జరగాలి

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం:

గిరిజన ప్రాంత ప్రజలకు ఎలాంటి నష్టం రాకుండా అన్ని విధాలా సహాయ సహకారాలు అందించి మేలు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ జీసీసీ బ్రాంచ్ మేనేజర్లను ఆదేశించారు. గిరిజన సహకార సంస్థ నిర్వహణపై సమీక్ష సమావేశాన్ని ఐటీడీఏ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. గిరిజన సహకార సంస్థ ద్వారా అమలవుతున్న అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, విక్రయాలు, స్టోరేజ్, డీఆర్ డిపోల నిర్వహణ, గిరిజన సహకార సంస్థ ద్వారా గిరిజనులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల నుంచి కొనుగోలు చేసిన అటవీ ఉత్పత్తులను ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలన్నారు. డివిజన్ పరిధిలో గల డీఆర్ డిపోల పనితీరు మరింత మెరుగుపడాలన్నారు.



జీసీసీ అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

అటవీ ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులను గిరిజన రైతులు విక్రయాలు జరిపే సమయం ఆసన్నమైనందున జీసీసీ సిబ్బంది సంతలు, గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రైవేటు మార్కెట్ ధరలకు ధీటుగా గిరిజనులకు ధర వచ్చేలా చూడాలని మేనేజర్లను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని సాలూరు, పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురంలో గల సిబ్బంది డీఆర్ డిపో, సంత పాయింట్లలో సమయానుకూలంగా పని చేయాలన్నారు. గిరిజనుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. గిరిజన ఉత్పత్తులపై, విక్రయాలపై ప్రతీ 15 రోజులకు సమీక్ష ఉంటుందన్నారు. సమీక్షలో డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్, సాలూరు, గుమ్మలక్ష్మీపురం బ్రాంచ్ మేనేజర్లు జె.రామారావు, వి.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.